సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



వర్సిటీ విద్యార్థులకు పతకాలు

విశాఖ: ఇటీవల జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు రెండు విభాగాలలో పతకాలు సాధించారు.



ప్రజలకు మేలు చేసే పార్టీ

మైనార్టీలను గుర్తించింది వైఎస్సార్. ఆ తర్వాత సీఎం జగనేనని నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ కొనియాడారు. IIలో

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
6.14	4.35

నర్సీపట్నం

ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
6.17	4.32

న్యూస్‌రీల్

సుబ్బారెడ్డి, బాబూరావుకు అభినందనల వెల్లువ



ఢిల్లీలో సుబ్బారెడ్డిని అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: రాజ్యసభ సభ్యులుగా గురువారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సీనియర్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావులకు అభినందనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావును పెద్దల సభకు పంపించి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి విశ్వసనీయత, విధేయతకు పెద్దపీట వేశారని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాస్, గుడివాడ అమర్‌నాథ్, కె.కె రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఆడారి ఆనంద్‌కుమార్ ఫోన్‌లో అభినందనలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్ల శివ గణేష్, పలువురు నేతలు ఢిల్లీవెళ్లి సుబ్బారెడ్డిని అభినందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం విశాఖకు చేరుకున్న గొల్ల బాబూరావును వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పతివాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఎయిర్‌పోర్టులో కలిసి అభినందనలు తెలిపారు.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు పునఃప్రారంభం



చిన్నపిల్లల వార్డును పునఃప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఆధునికీకరణ పనులు పూర్తయిన చిన్నపిల్లల ఐసీయూ(పీఐసీయూ) వార్డును కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం పునఃప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.80 లక్షల నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అలాగే కార్డియాలజీ (సీటీవీఎస్) విభాగంలో రూ.25 లక్షల నిధులతో గుండె శస్త్రచికిత్స ఐసీయూ, వార్డుల ఆధునికీకరణ, రూ.15 లక్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగ అనుసంధాన వారధి (ర్యాంప్) పనులు పూర్తయిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ఆయా విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, చిన్నపిల్లల వార్డు విభాగాధిపతులు డాక్టర్ చక్రవర్తి, వైద్యాధికారులు ఎడి శ్రీనివాస్ కుమార్, రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, డీఈ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి పదోన్నతిపై ఐదుగురు వైద్యులు

అనకాపల్లి : జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి పదోన్నతిపై అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి ఐదుగురు వైద్య సిబ్బంది వివిధ రోజుల్లో వచ్చినట్టు ఆస్పత్రి వర్గాలు గురువారం వెల్లడించాయి. విజయనగరం నుంచి కంటి వైద్యుడు గౌతమ్, గైనకాలజిస్టు సోభారాణి, యలమంచిలి నుంచి సౌజన్య గైనకాలజిస్టు, నక్కపల్లి నుంచి మత్తు డాక్టర్ శ్రీధర్, చోడవరం నుంచి జనరల్ ఫిజీషియన్ గౌతమ్ వచ్చారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం దశల వారీగా భర్తీ చేస్తున్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

ఇలా అయితే.. మా బతుకులు

ఏమవుతాయో?



సచివాలయంలో పింఛన్ల కోసం కోసం వేచి ఉన్న వృద్ధులు

- మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి
- ఆయన కొనసాగితేనే మా పెన్షన్లకు భరోసా
- సంక్షేమంతో పేద బతుకులు కులాసా
- చంద్రబాబు వస్తే మాలాంటోళ్లకు అధోగతే..
- నోటికాడ కూడు తీసేస్తాడంటూ ఆందోళన
- పెన్షన్ కోసం అవస్థలు పడుతున్నామంటున్న పింఛనుదారులు



మునగపాక: సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

సాక్షి, విశాఖపట్నం :

ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, పింఛన్లు పుణ్యమాని ఐదేళ్లు నోట్లోకి వెళ్తున్నాయన్న ధీమా అందరిలోనూ ఉంది. అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు వీరి ఆందోళనకు కారణమవుతోంది. గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి పెన్షన్లతో పాటు పలు సంక్షేమ పథకాలను వారి ద్వారా ప్రజలకు నేరుగా అందేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఈ వ్యవస్థతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. అలాంటి విజయవంతమైన వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుయుక్తులను వీరు కళ్లారా చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లను ప్రజలకు దూరం చేసే ఎత్తుగడ వేసింది. దీంతో ఎన్నికలయ్యే దాకా వారిని దూరం పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వా తాతల ఇళ్లకెళ్లి వారి చేతిలోనే పెన్షను సొమ్మును అందజేసే వీలు లేకుండా పోయింది. అంతేకాదు.. ఎక్కడో దూరంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్ డబ్బు తీసుకునే పరిస్థితి వచ్చింది. అదీ మండుటెండల్లో పండుటాకులు వెళ్లి రావడానికి ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇన్నాళ్లూ ఇంటికే పెన్షను తీసుకొచ్చి ఇచ్చే వారికి అడ్డుపడి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ చంద్రబాబుపై వీరు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. 2019కి ముందు ఆయన హయాంలో ఇలాంటి పరిస్థితే ఉండేదని వీరంతా గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థనే కాదు.. సంక్షేమ పథకాలతో పాటు పింఛన్లకూ గండి కొడతారని, నోటి కాడ కూడు తీసేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులు తదితరులు కలవర పడుతున్నారు.

వేగం పుంజుకున్న పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీ మరింత వేగం పుంజుకుంది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచే సచివాలయాల్లో సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేపట్టి రాత్రి ఏడు గంటల వరకు కొనసాగించారు. పింఛనుదార్లు వేచి ఉండకుండా సత్వరమే సొమ్ము అందజేశారు. వీరికి ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు, కుర్చీలు, మంచి నీటి సదుపాయం కల్పించారు. విశాఖ జిల్లాలో 1,65,432 పెన్షన్లకు గాను 1,53,323 (92.68 శాతం) మందికి పంపిణీ చేశారు. 2,66,208 పింఛనుదార్లున్న అనకాపల్లి జిల్లాలో 2,26,422 (85.05 శాతం) మందికి అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,27,894 మంది పింఛన్లకు గాను 91,938 (71.89 శాతం) మందికి పంపిణీ జరిగింది.

4 కిలోమీటర్లు నడిచి వెళ్లి..



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు పాగి కన్నబాబు. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు మదనగరువు గిరిజన గ్రామం అతనిది. చింతలపూడి సచివాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉందా గ్రామం. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి తెచ్చి పింఛన్ సొమ్ము అందించేవారు. వృద్ధాప్యంలో ఆరోగ్యం సహకరించక అవస్థలు పడుతున్న ఆ గ్రామ పింఛనుదార్లను ఇప్పుడు చింతలపూడి సచివాలయానికి రప్పించారు. నాలుగు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు దాటి కాలినడకన ఎంతో ఇబ్బంది పడి పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడాయన. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్న వారికి తమ ఉసురు తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. మళ్లీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్లు ఇవ్వాలని ఆయన ప్రాధేయపడుతున్నాడు.



దేవరాపల్లి: సచివాలయం వద్ద క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న అవ్వా తాతలు



నక్కపల్లి: యువతి సాయంతో సచివాలయానికి వచ్చిన వృద్ధురాలు



మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఇంటి వద్దకు వెళ్లి పింఛను ఇస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చిన్న, కార్యదర్శి ప్రవీణ్



కోటవురట్ల: చినబొడ్డేపల్లిలో మంచానికే పరిమితమైన సాయికి పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజు

మాకెందుకీ కష్టం



తెల్లారేసరికి వలంటీరు ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవోరు. చంద్రబాబు హయాంలో పింఛను కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. జగన్ బాబు దయ వల్ల మా ఇబ్బందులు తప్పాయి. కానీ ఇప్పుడు వలంటీర్లను ఆపేయడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయం దగ్గరికి వెళ్లి పడిగాపులు పడలేకపోతున్నాను. మళ్లీ ఇంటింటికీ వచ్చి పింఛను అందజేయాలి

–పి. అప్పలనర్స, మామిడివాడ (రాంబిల్లి)

చెంద్రబాబూ నీకిది ధర్మమా..



వలంటీరు బాబు ఇంటింటికీ వచ్చి పింఛనీ డబ్బులు ఇచ్చేవోడు. జగన్‌బాబు దయతో ఇన్నాళ్లూ ఏ కట్టం లేకుండా బతికాం. వలంటీరును ఇంటికే పంపి డబ్బులిచ్చేవాడు. ఇపుడేమో చెంద్రబాబు ఇలా మమ్మల్ని కట్టపెడుతున్నాడు. నీకేమైనా ఇది ధర్మమా చెంద్రబాబూ. ఈ ఎండలో రాజుపేట ఎళ్లాలంటే ఎలాగా?..మాలాంటోళ్లు ఏం చేశారు. నువ్వేం బాగుపడతావ్. నిన్ను రానిత్తే మాలాంటి ముసలోళ్లని చంపేత్తావ్. దేవుడి దయతో మళ్లీ మా జగన్‌బాబే వత్తాడు. మేము బతికుంటే సల్లగా సూత్తాడు.

–కూరాకుల చినతల్లి, పింఛనుదారు, రామన్నపాలెం (కోటవురట్ల)

ఇంటికే పింఛనివ్వాలి



నాకు 80 ఏళ్లుంటాయి. ఈ వయస్సులో గూను వంచుకుని ఎండలో సచివాలయానికి వచ్చి లైన్లో ఉండి పింఛన్ పొందాలంటే ఎంత కష్టమో ఒకసారి ఆలోచించాలి. టీడీపీ వోళ్లు వలంటీర్లను ఇంటికి రాకుండా చేసి, మాలాంటి వృద్ధులను నడిపించడం మంచిది కాదు. ఇకనైనా ఇంటికే తెచ్చి పింఛను అందించాలి.

– సియ్యాద్రి శేషమ్మ, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

రెండు రోజుల్లో 85 శాతం పంపిణీ

- జిల్లాలో 2,26,422 మందికి అందిన పింఛను

తుమ్మపాల: జిల్లాలో రెండో రోజు సచివాలయాల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ ఉద్యోగులు వృద్ధులు, వికలాంగులకు నగదు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వికలాంగులు, కదలలేని వృద్ధులు, అనారోగ్య పింఛనుదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్ అందించారు. జిల్లాలో రాత్రి 7 గంటల వరకు 2,26,422 మందికి పింఛన్ అందింది. రెండు రోజుల్లో 85.05 శాతం నగదు పంపిణీ పూర్తి చేశారు. సచివాలయాలకు వచ్చే పింఛనుదార్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టెంట్లు, కుర్చీలతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. అవ్వా తాతల కష్టాలను చూడలేక అనేక చోట్ల ఇళ్లకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మిగిలిన 39,786 మందికి శుక్రవారం మధ్యాహ్నం నాటికి పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. అత్యధికంగా అనకాపల్లి టౌన్‌లో 94 శాతం కాగా అత్యల్పంగా ఎస్.రాయవరం మండలంలో 76.28 శాతం మందికి పింఛన్లు అందించారు.

వలస అభ్యర్థి రమేష్‌కు స్థానిక సమస్యలేం తెలుసు

- రైతు బిడ్డగా ప్రజల ఆశీర్వాదంతో ఎదిగాను
- మళ్లీ ఆశీర్వదించండి
- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



అనకాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బలహీన వర్గాల వారి తరఫున రైతు కుటుంబానికి చెందిన తనను ప్రజలంతా ఆశీర్వదించి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కోరారు. స్థానిక విజయరామరాజు పేటలో ఎన్నికల ప్రచారంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచ్ నుంచి ఉప ముఖ్యమంత్రి స్థాయికి ప్రజల ఆశీర్వాదాలతో ఎదిగానని, ఈ ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్నానని జిల్లా ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఎక్కడో రాయలసీమ నుంచి దిగుమతి అయిన సీఎం రమేష్‌కు జిల్లాలో ప్రజల సమస్యలు ఏమి తెలుస్తాయన్నారు. ధన బలంతోనే ఆయన ఇక్కడ పోటీ చేస్తున్నారని తెలిపారు. గతంలో అనకాపల్లి పార్లమెంటుకు పోటీ చేసిన నూకారపు సూర్యప్రకాశరావు, అల్లు అరవింద్‌లకు ప్రజలు ఎలా ఓటుతో బుద్ధి చెప్పారో సీఎం రమేష్ గుర్తు చేసుకోవాలన్నారు. అవ్వా, తాతలు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటుంటే చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను నాశనం చేసేందుకు కుట్ర పన్నాడని, ప్రభుత్వ పింఛన్ కోసం సచివాలయాల చుట్టూ తిరిగేలా చేసిన చంద్రబాబుకు ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. అనకాపల్లి ఎంపీగా గెలుపొందిన వెంటనే క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వారానికి రెండు రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకుంటామని ప్రజలు చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పలకా యశోద పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

- తొమ్మిది విభాగాలతో నిరంతరం విధులు
- సామాజిక మాధ్యమాలు, వీడియోల ద్వారా ప్రచారాలపై నిఘా



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల : సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి జిల్లాలో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, ఎన్నికలలో నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కోసం ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందన్నారు. దీనిలో తొమ్మిది విభాగాలుంటాయని మీడియా మోనిటరింగ్, సోషల్ మీడియా మోనిటరింగ్, కంప్లైంట్స్ మోనిటరింగ్, కాల్ సెంటర్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, ఎక్స్‌పెన్డీచర్ మోనిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ (జీపీఎస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్ విభాగాలుంటాయని తెలిపారు. జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇక్కడి నుండే గమనించవచ్చన్నారు. ఈ విభాగాలన్నింటికీ జిల్లా అధికారులు నేతృత్వం వహిస్తున్నారన్నారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం ఇన్‌చార్జి పి.ప్రసాద్ కంట్రోల్ సెంటర్ గూర్చి వివరిస్తూ మీడియా మోనిటరింగ్ సెంటర్‌లో పత్రికలు, టీవీ ఛానళ్లలో వచ్చే వార్తలు, స్క్రోలింగ్‌లు, ఇతర సమాచారం ఈ విభాగంలో రికార్డు చేసి, గుర్తించిన అంశాలను సంబంధిత పార్టీలు, అభ్యర్థుల పరంగా పొందుపరుస్తారని చెప్పారు. సోషల్ మీడియా విభాగంలో యూట్యూబ్, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో వచ్చిన సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఫిర్యాదుల విభాగంలో సి.విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, ఎన్నికల కమిషన్ సైట్‌లలో నమోదైన ఫిర్యాదులు, వివిధ పత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలను గమనించి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపిస్తారని, అలాగే గ్రీవెన్స్ కాల్‌సెంటర్‌లో టోల్‌ఫ్రీ నెం.1950, ల్యాండ్ లైన్ నెం.08924 226599కు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించి తగిన సమాచారాన్ని సేకరించి పంపిస్తారన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విభాగంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తీసిన వీడియోలను వీడియో వీవింగ్ టీమ్ పరిశీలించి పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను పాటిస్తున్నదీ లేనిదీ గమనించి తగిన చర్యలు చేపడతారని చెప్పారు. జీపీఎస్ ట్రేసింగ్ ద్వారా వాహనాల గమనాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. వాహనాల పర్యవేక్షణ విభాగంలో అవసరాల మేరకు వివిధ వాహనాలను అందించడం, వెబ్ కాస్టింగ్ ద్వారా వివిధ చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు చేస్తున్న తనిఖీలను పరిశీలించడం జరుగుతుందన్నారు.

బురద రాజకీయం కట్టిపెట్టండి

- లబ్ధి పొందడానికే నాపై తప్పుడు ఆరోపణలు
- అభివృద్ధి గురించే మాట్లాడతా.. చిల్లర కబుర్లు నాకు తెలీవు
- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో స్థానికులకే పట్టం
- సి.ఎం.రమేష్ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే కన్నబాబురాజు కౌంటర్

యలమంచిలి: నాకు కుటిల రాజకీయాలు తెలీవు.. చిల్లర కబుర్లు చెప్పను.. ఉన్నదున్నట్టు మాట్లాడతా.. అభివృద్ధి గురించే ఆలోచిస్తా.. నాపై బురద జల్లే ప్రకటనలు చేసి హైలెట్ అవుదామనుకుంటే అది పొరపాటు.. అని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు ప్రతిపక్ష కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్‌కు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. గురువారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల నాయకులనే విమర్శించని వ్యక్తిత్వం తనదన్నారు. అచ్యుతాపురంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కూటమి సమావేశంలో సీఎం రమేష్ బుధవారం చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు. తాను చేసే అభివృద్ధి, చేయాల్సిన పనులపైనే ఎక్కువగా మాట్లాడతానన్నారు. ఇవాళ బయట నుంచి వచ్చిన వ్యక్తి ఎక్కువ డబ్బులు పట్టుకువచ్చి తమకు ఇస్తాడని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆశపడి ఏదో అనుకుంటున్నారని, యలమంచిలి నియోజకవర్గంలో కన్నబాబు అయితేనే అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో ఇక్కడి ప్రజలు ఉన్నారన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తే వారు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. యలమంచిలి నియోజకవర్గ టీడీపీ నేతలు కుర్చీలతో కొట్టుకుంటున్నారని, వారిలో వారికి సమన్వయం లేక సతమతమవుతున్నారని ఎద్దేవా చేశారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో స్థానికేతరులు గెలిచిన దాఖలాలు లేవన్నారు. బయట నుంచి వచ్చిన వ్యక్తులు ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉంటామని కాకమ్మ కథలు చెబుతారని.. అవి ఒట్టిమాటలే అన్నారు. ఢిల్లీలో, ఇతర ప్రాంతాల్లో ఉంటారన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు చాలా తెలివైనవారని వారు స్థానికులనే గెలిపిస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో 30 వేల నుంచి 40 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలెవరూ నమ్మరని, వారికి ఓట్లు పెరగవన్నారు.

ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందిస్తా..

ప్రస్తుత ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఎవరైనా రాత్రి పూట ఫోన్ చేస్తే ఎత్తరని కన్నబాబు వ్యాఖ్యానించారు. తనకు ఎవరైనా రాత్రి సమయంలో ఫోన్ చేసినా సింగిల్ కాల్‌కు ఎత్తి వారి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో 7 సెగ్మెంట్లు, యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గ్రామాల సరిహద్దులు, ఎక్కడ ఏ ప్రాంతం ఉందో తెలియని వ్యక్తి ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ ఎంపీ అభ్యర్థి అని, అతనికి ప్రజలు ఏ విధంగా ఓటు వేసి గెలిపిస్తారన్నారు. ఎంపీగా బూడి ముత్యాలనాయుడే అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు.

కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ) : వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం – కిరండూల్ – విశాఖపట్నం (08551 /08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

- వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు – కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం – కిరండూల్ (08551), కిరండూల్ – విశాఖపట్నం (085520 పాసింజర్ రైళ్లు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఎన్నికలొస్తే అయ్యన్నకు వసూళ్ల పండగ

- అయ్యన్నపై ఎమ్మెల్యే గణేష్ ధ్వజం



నర్సీపట్నం: ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్యాకేజీ అయ్యన్నపాత్రుడికి పండగేనంటూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికలకు ముందు తన కుమారుడు విజయ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలంటూ మీడియా ముందుకు రావటం పరిపాటిగా మారిందన్నారు. పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించిన వ్యక్తి నుంచి డబ్బులు గుంజేందుకే అయ్యన్న పన్నాగమని ఆక్షేపించారు. గతంలో ఎంపీగా పోటీ చేసిన నూకారపు సూర్యప్రకాష్‌తో పాటు ఎంతో మంది ఎంపీ అభ్యర్థుల నుంచి రూ.కోట్లలో అయ్యన్న దండుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ కూడా రూ.కోట్లలో ప్యాకేజీ ఇవ్వడంతో తన కొడుకు ఎంపీ టికెట్ ప్రతిపాదనని పక్కన పెట్టేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికలొస్తే అయ్యన్నకు డబ్బులు మిగులుతాయి తప్ప, పైసా ఖర్చు ఉండదన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో తూర్పుగోదావరి నుంచి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు అయ్యన్న ఇంటికి వస్తే పిల్లిలా ఇంట్లో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఇంటికి పోలీసులు వస్తే పెళ్లాం, పిల్లల్ని వదిలి గోడ దూకి పారిపోయిన పిరికిపంద విజయ్ ప్రగల్భాలు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడిని ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

- రూ.8.12 లక్షలు కాజేసిన ఇద్దరిపై ఫిర్యాదు

అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగం పేరిట మోసం చేసిన ఇద్దరిపై పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు. స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన యర్రంశెట్టి లక్ష్మీకాంత్‌కు విశాఖ కలెక్టర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు ఇప్పిస్తామని విశాఖకు చెందిన యర్రంశెట్టి సింహాచలం, ఆయన కుమారుడు శ్రీనివాస్‌కార్తీక్‌లు నమ్మబలికారు.

ఇందుకు ఈ ఏడాది జనవరిలో పలు విడతల్లో రూ.8 లక్షల 12 వేలు నగదు వసూలు చేశారు. అనంతరం నియామక పత్రాన్ని కూడా అందించారు. అయితే ఆ నియామకపత్రం నకిలీదని తెలుసుకున్న లక్ష్మీకాంత్ తానిచ్చిన నగదు తిరిగివ్వాల్సిందిగా సింహాచలం, కార్తీక్‌లను అడిగారు. వారు మార్చి నాటికి పూర్తిగా చెల్లిస్తామని చెప్పారు. ఏప్రిల్ నెల వచ్చినా నగదు చెల్లించకపోవడంతో పోలీసులనాశ్రయించారు. లక్ష్మీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజీనామాలిచ్చాం.. మా సత్తా చూపిస్తాం

- జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే మా ధ్యేయం
- మూకుమ్మడి రాజీనామాల తర్వాత వలంటీర్ల ప్రతిజ్ఞ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి మా వంతు సేవ చేస్తున్నామనుకున్నాం. మా అవ్వాతాత, అత్తాపిన్ని, బాబాయ్, మామయ్య, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన లబ్ధిని ఎలాంటి తారతమ్యాల్లేకుండా అందించేందుకు దొరికిన మహదవకాశంగా భావించాం. అలాంటి మమ్మల్ని డేటా చోరులు, ఉమన్ ట్రాఫికర్లు అని పవన్‌కల్యాణ్ అన్నారు. చంద్రబాబుతో సహా టీడీపీ నేతల దృష్టిలోనైతే మేం దొంగలం, దోపిడీదారులం, ఉగ్రవాదులం. చాలా బాధించాయి. ఇలాంటి వారు అధికారంలోకి వస్తే ఇన్నాళ్లూ మేం అందించిన సేవలు లబ్ధిదారులకు ఎక్కడ దూరమవుతాయోనన్న భయం మాది. అందుకే వలంటీర్ పోస్టులకు రాజీనామాలిచ్చాం. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు మా వంతు సాయపడాలని నిశ్చయించుకున్నాం. ఇక మా సత్తా చూపుతాం. ఇదీ రాజీనామాలు చేసిన వలంటీర్ల నిర్ణయం. వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతున్నాయి.

నాతవరం: మండలంలో గురువారం సుమారు 200 మంది వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఎంపీడీవో జాగరపు రాంబాబుకు అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు పెట్టే ఇబ్బందులు, వేధింపులు భరించలేకే స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం ఇష్టం లేకనే చంద్రబాబు ఇలాంటి చెత్త ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఉసురు తగులుతుందని శాపనార్థాలుపెట్టారు. ఇప్పుడు ధైర్యంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా ఉమాశంకర్‌గణేష్‌ను, ఎంపీగా ముత్యాలనాయుడుని గెలిపించి, జగనన్నను సీఎంను చేసుకుంటామని పేర్కొన్నారు.

నర్సీపట్నం: మండలంలో 131 మంది, మున్సిపాలిటీ పరిధిలో 290 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను ఎంపీడీవో జాన్ లింకన్‌కు అందించారు. చంద్రబాబు రాజకీయ రంగు పులిమి, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న వలంటీర్ల విధులకు అటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు వేధింపుల వల్లే రాజీనామాలు చేసినట్లు పేర్కొన్నారు.

మాకవరపాలెం: ప్రతిపక్షాల కక్ష పూరిత వేధింపుల నేపథ్యంలో ఇప్పటికే మండలంలో 50 మంది రాజీనామాలు చేశారు. గురువారం మరో 160 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో చంద్రరావుకు అందించారు. రాజీనామా చేసిన వారిలో మండలంలోని కొండలఅగ్రహారం, తామరం, రాచపల్లి, పైడిపాల, బూరుగుపాలెం, తూటిపాల, జీ.వెంకటాపురం, పాపయ్యపాలెం, గిడుతూరు, లచ్చన్నపాలెం, శెట్టిపాలెం సచివాలయాల పరిధి వలంటీర్లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న తమపై ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదులు చేయడం బాధించిందన్నారు.

గొలుగొండ: నాగాపురం, గొలుగొండ పంచాయతీల్లో పనిచేస్తున్న 21 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందించారు. తమ సేవలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన వాఖ్యలు, ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదుల కారణంగానే రాజీనామాలు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి నుంచి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేసి, సీఎం జగన్ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ సచివాలయానికి చెందిన 13 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని స్థానిక పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావుకు గురువారం అందజేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ నిష్పక్షపాతంగా సేవలందిస్తున్న తమను తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడుతూ, మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



నాతవరం: రాజీనామా చేసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు విలేకరులతో మాట్లాడుతున్న వలంటీర్లు


నర్సీపట్నం: ఎంపీడీవో జాన్ లింకన్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు


మాకవరపాలెం: రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందిస్తున్న కొండలఅగ్రహారం వలంటీర్లు


గొలుగొండ: నాగాపురం గ్రామంలో రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు


దేవరాపల్లి: రాజీనామా పత్రాన్ని పంచాయతీ సెక్రటరీ అప్పారావుకు అందిస్తున్న బోయిలకింతాడ వలంటీర్లు

ప్రజలకు మేలు చేసే పార్టీ వైఎస్సార్‌సీపీ


దూదేకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓతూరి రసూల్

- నూర్‌బాషా మైనార్టీలను గుర్తించింది వైఎస్సార్‌సీపీనే
- రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల)కార్పొరేషన్ చైర్మన్ ఓతూరి రసూల్

యలమంచిలి: ప్రజలకు మేలు చేసే పార్టీ రాష్ట్రంలో ఏదైనా ఉందంటే అది వైఎస్సార్‌సీపీయేనని రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల) కార్పొరేషన్ చైర్మన్ ఓతూరి రసూల్ అన్నారు. యలమంచిలి పట్టణంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి నూర్‌బాషా సంఘ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. నూర్‌బాషా మైనార్టీలను గుర్తించింది దివంగత మహానేత వైఎస్సార్, ఆ తర్వాత సీఎం జగనేనని కొనియాడారు. జగన్ ప్రభుత్వంలో కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు మత రాజకీయాలు చేస్తూ, రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తన పాలనలో ప్రజలకు జరిగిన మేలును తెలిపి, ఓటడిగే ఏకైక సీఎం జగనేనన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని ప్రధాని మోదీ తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చి మోసం చేశారని, అలాంటి మోసపూరిత బీజేపీతో కూటమి కట్టి, బూటకపు హామీలతో మన ముందుకు వస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలతోపాటు నూర్ బాషా వర్గం ఆర్థికంగా బలోపేతం కావాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి నూర్‌బాషా సభ్యుడు కృషి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర నూర్ బాషా సంఘం కన్వీనర్ షేక్ ఇస్మాయిల్. జిల్లా కమిటీ సభ్యులు షేక్ ఖాన్‌సాహెబ్, అబ్దుల్లా మాస్టారు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల బాజీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ బాబా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ బాబ్జి, నియోజకవర్గ మైనార్టీ సెల్ సభ్యుడు ఎస్‌కే వలీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి

- యలమంచిలి నియోజకవర్గంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పర్యటన


అచ్యుతాపురం జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



కొక్కిరాపల్లి ఎంపీయూపీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్

యలమంచిలి రూరల్: పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులపై క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలుసుకునేందుకు గురువారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి యలమంచిలి నియోజకవర్గంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. పట్టణంలోని సీపీ పేట, కోమటిపేట, కొక్కిరాపల్లి ఎంపీయూపీ స్కూళ్లు, ఎంపీడీవో కార్యాలయం, రాంబిల్లి మండలంలోని నారాయణపురం, మామిడివాడ, అప్పారాయుడుపాలెం, పూడి కాలనీ, అచ్యుతాపురం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు వసతులపై ఆరా తీశారు. దివ్యాంగులు, వృద్ధుల అవసరాలకు తగ్గట్లు విద్యుత్తు, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకు సంబంధించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలుపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోడల్ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె మనోరమ, యలమంచిలి తహసీల్దార్ అప్పలరాజు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల ఏఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, 85 ఏళ్ల వృద్ధులకు ఇంటివద్ద నుంచే ఓటేసే అవకాశం

తుమ్మపాల: పోలింగ్ ప్రక్రియలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులతో పాటు వికలాంగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కేంద్రాల వద్దే పోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని 85 ఏళ్లు నిండిన సీనియర్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లకు ముందుగా ఫారం -12డి ఇచ్చి దరఖాస్తు చేయించాలన్నారు. ఒకసారి దరఖాస్తు చేసిన తరువాత వారు ఇంటి వద్దనే తప్పక ఓటు వేయవలసి ఉంటుందన్నారు. సర్వీసు ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ తప్పక ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు వాహన సౌకర్యం కల్పించాలన్నారు. హోమ్ ఓటింగ్‌లో రహస్య ఓటింగ్‌కు తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూటింగ్, కలెక్షన్, సిబ్బందికి చెల్లింపుల వద్ద నిపుణులైన సిబ్బందిని నియమించాలని సూచించారు. ఏ విషయంలో ఎటువంటి తప్పు దొర్లకుండా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరామ్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ హేమంత్, ఆర్వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బై.. బై.. వైజాగ్



విమానాశ్రయంలోకి వెళ్తున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు సభ్యులు

గోపాలపట్నం: ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్లు విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. విశాఖ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం కేకేఆర్ జట్టు చెన్నైకు, సాయంత్రం డీసీ జట్టు ముంబయికి ప్రత్యేక విమానంలో బయలుదేరాయి. వీరికి అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా డీసీ ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన డీసీ.. కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారీ ఓటమి చవిచూసింది. అయితేనేం ఐపీఎల్ అభిమానులకు మరిచిపోలేని జ్ఞాపకాలను అందించింది. డీసీతో జరిగిన మ్యాచ్‌ను ఎంజాయ్ చేసిన కేకేఆర్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్ కూడా ప్రత్యేక విమానంలో ముంబయి వెళ్లారు.

క్రైమ్ కామెడీ చిత్రం పారిజాత పర్వం

బీచ్ రోడ్డు(విశాఖ): క్రైమ్ కామెడీ చిత్రం పారిజాత పర్వం అని, ప్రేక్షకులకు మంచి వినోదం పంచుతుందని నిర్మాత పద్మ తెలిపారు. చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం చిత్ర యూనిట్ విశాఖలో సందడి చేసింది. మీడియాతో మాట్లాడుతూ రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా పారిజాత పర్వం నిర్మించామని, తప్పకుండా ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్యంతో పట్టుబడ్డ ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చోడవరం రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసుల నిఘా, విస్తృత తనిఖీలతో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న పలువురు పోలీసుల చేతికి చిక్కుతున్నారు. వారి నుంచి మద్యాన్ని, రవాణా వాహనాలను సైతం పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. గురువారం చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. స్థానిక మెయిన్ రోడ్డులో రత్నం రెస్టారెంట్ వద్ద ఎస్ఐ డి.శేఖరం సిబ్బందితో కలసి నిర్వహించిన తనిఖీల్లో చోడవరానికి చెందిన కళ్లేపల్లి శ్రీనివాసరావు(50) హోండా ఏక్టివా వాహనంలో 9 మద్యం క్వార్టర్ బాటిళ్లతో దొరికాడు. దీంతో మద్యం సీసాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

గజపతినగరం జంక్షన్‌లో....

చోడవరం–అనకాపల్లి రోడ్డులో అంభేరుపురం ఆంజనేయస్వామి గుడి జంక్షన్ వద్ద మరొకరిని పట్టుకున్నారు. గోవాడలో నివాసం ఉంటున్న విజయనగరం జిల్లా తూరుమామిడికి చెందిన యాగిరెడ్డి నారాయణరావు(38) అక్రమంగా 16 మద్యం క్వార్టర్ బాటిళ్లతో పోలీసులకు చిక్కాడు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు బదిలీ

అల్లిపురం : రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టు గురువారం పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో విశాఖకు చెందిన పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ప్రస్తుత ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీఎల్ హిమబిందు శ్రీకాకుళం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ బదిలీపై వస్తున్నారు. ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సీహెచ్ యుగంధర్ శ్రీకాకుళం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ పద్మజ బదిలీపై వస్తున్నారు. నాల్గో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ టీవీ రాజేష్‌కుమార్ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కె. వాసుదేవరావు బదిలీపై వస్తున్నారు. విశాఖ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేకానంద్ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత బదిలీపై వస్తున్నారు.


వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: మండలంలోని వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. పాల కేంద్రం అధ్యక్షులు వెదుళ్ల ఈశ్వరరావు, వెదుళ్ల నాగేశ్వరరావు, వెదుళ్ల మణి, పొనగాల నాగేశ్వరరావులతో పాటు చేరిన పలువురిని పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఎమ్మెల్యే జోగులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేసిందన్నారు. పెన్షన్ల పంపిణీలో చంద్రబాబు చేస్తున్న కుట్రలు చాలా బాధ కలిగిస్తున్నాయన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి, జగనన్న సీఎం కావాలనే ఉద్దేశంతోనే పార్టీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నానాజీ, ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సర్పంచ్‌లు వెదుళ్ల వరలక్ష్మి, రెడ్డి వరహాలు పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, ఎంపీటీసీ చంద్రరావు, బచ్చల రాజు, మనబాల దేముళ్లు, జేసీఎస్ కన్వీనర్ ఎస్ గోవింద్, వెదుళ్ల రమణ, కాకర వెంకటరావు, కె.రమణ, ఏరిపిలి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాకి.. బండారు!

- టీడీపీ కింది స్థాయి నేతల టచ్‌లోకి పంచకర్ల
- మాజీ మంత్రిని పక్కన పెట్టేసిన వైనం
- 43 ఏళ్ల సీనియర్‌కు అవమానాలు
- ఎక్కడికక్కడ బండారు వర్గాన్ని వెక్కిరిస్తున్న జనసేన క్యాడర్



పెందుర్తి: జగమంతా కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది అన్నట్లు తయారైంది 43 ఈయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ బండారు సత్యనారాయణమూర్తి పరిస్థితి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, టీడీపీలో రాష్ట్ర స్థాయి నేతగా గుర్తింపు పొందిన బండారు ప్రస్తుతం ఇంటి నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థిగా పెందుర్తి బరిలో ఉన్న పంచకర్ల రమేష్‌బాబు తన చిరకాల ప్రత్యర్థి బండారు సత్యనారాయణమూర్తిని క్రియాశీల రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకునేలా చేశారు. కూటమి అభ్యర్థిగా ఉన్న రమేష్‌బాబు ప్రధాన పార్టీ టీడీపీని కలుపుకుని వెళ్లాల్సింది పోయి.. దొడ్డిదారిలో టీడీపీలో బండారు వ్యతిరేక వర్గాన్ని చేరదీస్తున్నారు. అదే సమయంలో నియోజకవర్గంలో అడుగడుగునా బండారు వర్గానికి జనసేన క్యాడర్ నుంచి తీవ్రస్థాయిలో అవమానాలు ఎదురవుతున్నాయి. 'మాకు మీ అవసరం లేదు'అంటూ బండారు వర్గాన్ని మరింత రగిలిపోయేలా చేస్తున్నారు.

అధినేత నుంచే అవమానం

జనసేన–టీడీపీ జత కట్టిన దగ్గర నుంచి సీనియర్, స్థానికుడైన బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబు, లోకేష్ కూడా పలు బహిరంగ వేదికల్లో బండారుకే టికెట్ అన్నట్లు సంకేతాలిచ్చారు. తీరా ఆఖరి నిమిషంలో బండారును కాదని కొద్ది రోజుల కిందట జనసేన తీర్థం పుచ్చుకున్న స్థానికేతరుడు పంచకర్లకు పెందుర్తి టికెట్ కేటాయించారు. బండారుకు టికెట్ ఇవ్వకపోగా.. కనీసం ఆయన అభిప్రాయాన్ని కూడా చంద్రబాబు పరిగణలోకి తీసుకోలేదు. ఒకవైపు టికెట్ నిరాకరించడం.. మరోవైపు తన చిరకాల ప్రత్యర్థి అయిన రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంతో బండారు రగిలిపోతున్నారు. నిద్రాహారాలు కూడా సరిగా లేకపోవడంతో కొద్ది రోజుల కిందట అనారోగ్యం పాలయ్యారు. అయినా కూడా టీడీపీ అధిష్టానం నుంచి కనీసం పరామర్శ లేదని బండారు వర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది.

బండారా.. డోంట్ కేర్ : ఇదిలా ఉండగా జనసేన నుంచి కూడా బండారుకు తొలి నుంచి అవమానాలే ఎదురవుతున్నాయి. ఇరు పార్టీలు జతకట్టిన తర్వాత తప్పదన్నట్లు అప్పుడప్పుడు కలసి తిరిగినా.. బండారు–పంచకర్ల బంధం టికెట్ కేటాయించిన తర్వాత అతుక్కునే ప్రయత్నమే జరగలేదు. బెర్త్ ఖాయం చేసుకొని పెందుర్తి నియోజకవర్గంలో అడుగుపెట్టిన పంచకర్ల రమేష్‌బాబు మర్యాద కోసమైన బండారును పలకరించలేదు. ఇంటికే పరిమితమైన బండారు లేకపోతే మాకేంటి అనే రీతిలోనే జనసేన తీరు ఉంది తప్పితే.. పొత్తు ధర్మం కోసం పంచకర్ల వర్గం బండారును కలుపుకునే ప్రయత్నం చేయలేదు. కాగా.. కొద్ది రోజులుగా బండారుపై కాస్తోకూస్తో అసంతృప్తిగా ఉన్న కిందిస్థాయి నాయకులతో పంచకర్ల టచ్‌లోకి వెళ్లడంతో.. బండారు వర్గం తీవ్రస్థాయిలో రగిలిపోతోంది. నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గంలో టీడీపీని మోసిన బండారు సత్యనారాయణమూర్తికి జనసేన నుంచి ఇన్ని అవమానాలా? అంటూ టీడీపీ పాత కాపులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి తాకాశివీధి నూకాంబిక జాతర

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం శుక్రవారం నుంచి మే 7 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న రాత్రి 7గంటల నుంచి శ్రీసత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద భజన కార్యక్రమంతో జాతర ఉత్సవం ప్రారంభం అవుతుందన్నారు. 6న సాయంత్రం 6 గంటలకు గరగల ఊరేగింపు, సీతానగరం వారిచే కోలాటం, వెంకటాపురం వారిచే తోడపెద్దు సేవ, 7న సాయంత్రం 6 నుంచి రాత్రంతా అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. 8న కొత్త అమావాస్య సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న క్రోధి నామ సంవత్సర ఉగాది నాడు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పండ్ల రసంతో అభిషేకాలు, రాత్రికి దీపాలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి నెబ్యులైజర్ వితరణ


నెబ్యులైజర్‌ను అందిస్తున్న సురేష్‌బాబు

అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలని జైభారత్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆస్పత్రి ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్‌కు నెబ్యులైజర్‌ను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధి పీడితులకు ఉపశమనం కోసం ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నేడు వయోవృద్ధుల సంఘ సమావేశం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం 60 ఏళ్లు దాటిన వృద్ధులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు.

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	: రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	: షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
ది గోట్ లైఫ్	: వెంకటేశ్వర
హనుమాన్	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 3,150 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,440
మొదటి రకం	3,570	4,090
రెండో రకం	3,400	3,790
మూడోరకం	3,290	3,490

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 366 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

- వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే పింఛన్లు
- ఒకటిన్నర రోజుల్లో దాదాపు 90 శాతం పంపిణీ
- ప్రభుత్వ చిత్తశుద్ధి, సచివాలయ ఉద్యోగుల నిబద్ధతే కారణం
- ప్రభుత్వ పనితీరుపై లబ్ధిదారుల ఆనందం

మా బిడ్డ జగన్.. ఆయన సీఎంగా ఉండగా మాకేంటి భయం. గడప దాటి బయటకు వెళ్లే పనిలేదు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీనే పింఛన్ ఇంటికే వచ్చి అందిస్తాడు. మా మద్దతు జగన్‌బాబుకే.. పింఛన్ లబ్ధిదారుల్లో ఎవర్ని కదిపినా ఇదే అభిమానం. అందుకే విపక్షాలన్నీ కలిసి కుట్రలు పన్నాయి. సీఎం జగన్‌ను గుండెల్లో పెట్టుకున్న వీరిని కన్నీళ్లు పెట్టించాలనుకున్నాయి. అయితే అక్కడున్నది సీఎం జగన్. ఈ కుట్ర రాజకీయాల కుత్తుకల్ని తెగనరికే అర్జునుడాయన. యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సచివాలయ సిబ్బంది ద్వారా రెండురోజుల్లోనే పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తి చేశారు. అనకాపల్లి నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది ఒకటిన్నర రోజులోనే 91 శాతం పింఛన్లు పంపిణీ చేసి శభాష్ అనిపించారు.

జగన్‌బాబు సల్లగుండాలా!

తుమ్మపాల: నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. సీఎం జగన్ ఆదేశాలు, సచివాలయ సిబ్బంది చొరవ, పరస్పర సహకారంతో లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ త్వరితగతినే పూర్తికానుంది. వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేయకుండా టీడీపీ, దాని అనుచర గణం ఫిర్యాదులపై ఎన్నికల సంఘం వారి సేవలను నిలిపేసిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నపళంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి రావడంతో. రెండు రోజులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ మొదలయింది.

వారి వల్లే రెండు రోజులు ఆలస్యం

సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం తమ ఇంటి గడప దాటాల్సిన పనిలేకుండా చేశారు. వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్లు అందించేవారు. ఈ ఐదేళ్లలో చివరి రెండు మూడు మాసాలకు మాత్రం ఇబ్బంది తప్పనిసరయింది. వలంటీర్ల సేవల్ని నిలిపేయడంతో ఈసారి సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీ ప్రక్రియ చేపట్టారు. అయినప్పటికీ నడవలేని వృద్ధులు, వికలాంగులకు సచివాలయ సిబ్బంది స్వయంగా లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎన్నికల సంఘం ఆదేశాలు, కూటమి పార్టీల కుట్రలు కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కారణంగా బ్యాంకుల నుంచి నగదు డ్రా చేయడంలో తలెత్తిన ఇబ్బందులతో రెండు రోజులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ మొదలయింది.

ఒకటిన్నర రోజులోనే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం(3వ తేదీ) నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలి. బ్యాంకుల నుంచి నగదు లభ్యత అనుకున్నంత వేగంగా జరగకపోవడంతో బుధవారం మధ్యాహ్నం, చాలా చోట్ల సాయంత్రానికిగానీ పింఛన్ల పంపిణీ మొదలవలేదు. నగదు అందుబాటులోకి వచ్చాక సిబ్బంది యుద్ధప్రాతిపదికన తమ కర్తవ్యం నిర్వర్తించారు. దీంతో గురువారానికి పింఛన్ల పంపిణీ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా సుమారు 30 శాతం పంపిణీ జరిగినప్పటికీ, నియోజకవర్గంలో అత్యధికంగా 65 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించారు. గురువారానికి నియోజకవర్గ పరిధిలో పింఛన్ల పంపిణీ 88.26 శాతానికి చేరింది. అనకాపల్లి పట్టణ పరిధిలో గరిష్టంగా 91.06 శాతం మందికి పింఛన్ పంపిణీ పూర్తిచేశారు. ప్రభుత్వ సంకల్పానికి తోడు, సచివాలయ సిబ్బంది నిబద్ధత జతకావడంతో పింఛన్ల పంపిణీ వేగంగా జరిగింది.

రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ ఇలా..

పరిధి	మొత్తం పింఛన్లు	పంపిణీ చేసినవి	శాతం
అనకాపల్లి పట్టణం	10,148	9,241	91.06
అనకాపల్లి మండలం	13,109	11,309	86.27
కశింకోట మండలం	10,574	9,308	88.03
మొత్తం	33,831	29,858	88.26

కశింకోట: మండలంలో రెండో రోజు గురువారం కూడా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేశారు. అయితే రద్దీ బాగా తగ్గింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండో రోజు ఉదయమే సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు. దీంతో వచ్చిన వారు వచ్చినట్లు పింఛన్ తీసుకెళ్లారు. అయితే వృద్ధులు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డారు. దీంతో వృద్ధులు వడ దెబ్బకు గురవకుండా ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నడిచి రాలేని వారికి వారిళ్ల వద్దే పింఛన్ పంపిణీకి చర్యలు చేపట్టారు. మండలంలో దాదాపు 90 శాతం పింఛన్ల పంపిణీ రెండో రోజుల్లో జరిగిందని, మిగిలిన వారికి 6లోగా పంపిణీ చేస్తామని ఎంపీడీవో శేషుబాబు తెలిపారు.


కశింకోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఇంటికొచ్చి పింఛనిచ్చారు



నా వయస్సు 75 ఏళ్లు. సరిగా నడ్లేను. నా కూతురింటికాడ ఉంతన్నాను. అన్ని సపర్యలూ కూతురే సేత్తాది. ఇన్నాళ్లూ పింఛను డబ్బులు వలంటీర్ మా ఇంటికాడికొచ్చి ఇత్తాడని నాల్రోజుల్నుంచి సూత్తన్నా. ఆ టీడీపీవోడు సెంద్రబాబే ఈ నెల పింఛనీలివ్వకుండా వలంటీరుల్ని ఆపేసినాడట. ఆయన గవుర్నుమెంటులో పింఛను కోసం మాలాటోల్ని జన్మభూమి కమిటీల సుట్టూ తిప్పించి, ఎన్ని తిప్పలు పెట్టినారో మర్సిపోతామేటి. జగనుబాబొచ్చాక ఆ ఇబ్బందులేవీ నేవు. టయానికి ఇంటికాడే అన్నీ అందిస్తన్నారు. ఏ పథకానికీ గడప దాటెల్లిందే నేదు. ఇంటికాడికి అన్ని పథకాలు రావడం సెంద్రబాబుకు ఇష్టంనేదు మరి. సెంద్రబాబుకు మొదట్నుంచీ పేదోళ్లంటే సులకనే. మంచం దిగి, నడుసుకుంటూ సచివాలయానికి రాలేనని సెప్పడంతో సచివాలయం ఆపీసర్లే ఇంటికొచ్చి పింఛను డబ్బులిచ్చినారు. పది కాలాల పాటు జగన్‌బాబు సీఎంగా, సల్లగా ఉండాలి.

– కరణం సూరిబిల్లమ్మ, రేబాక, అనకాపల్లి మండలం

వలంటీర్లను కొనసాగించాలి



పింఛన్ సొమ్ము కోసం ఇంటి పనులు ముగించుకుని, ఎండలోనే వెళ్లాల్సి వచ్చింది. గతంలో గ్రామ వలంటీర్ ఇంటికే వచ్చి ఉదయాన్నే పింఛన్ డబ్బులిచ్చేవారు. పింఛన్ కోసం ఎదురుచూపుల్లేవు. ఇపుడు పింఛన్ ఎప్పుడిస్తారా? అని అన్ని పనులూ మానుకుని ఎదురుచూడాల్సి వస్తోంది. అయినా ఎక్కడిస్తారో తెలీకా పంచాయతీ ఆఫీసుకి, సచివాలయానికి పరుగులు తీయాల్సి వచ్చింది. వలంటీర్లను కొనసాగించి, వారి ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తే ఈ ఇబ్బందులేవీ ఉండవు.

–కొణతాల అప్పలనరస, గవరపేట, కశింకోట

ఇంత అయోమయం ఎందుకు



చక్కగా జరుగుతున్న పింఛన్ల పంపిణీని అయోమయంలోకి నెట్టేశారు. ఈ ప్రతిపక్షాలకు మరేం పన్లేనట్టుంది. ప్రజలు సుఖంగా ఉంటే చూడలేకపోతున్నారు. ఇన్నాళ్లూ పింఛన్ ఠంచనుగా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి వద్దే వలంటీర్లు అందించేవారు. ఇపుడు సచివాలయానికి రావాల్సి వస్తోంది. పింఛన్ ఎప్పుడిస్తారో, ఎవరిస్తారో కూడి నిన్నటి వరకు తెలియని అయోమయం. వయస్సు మీరినవారు, ఆరోగ్య సమస్యలున్న వారు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– మహ్మద్ ఖలీల్ అహ్మద్, గోవిందరావు కాలనీ, కశింకోట

వైభవంగా నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవం

కశింకోట: మండలంలోని గొబ్బూరులో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పూలదండలు వేసి, జ్ఞాపికలను అందించి గౌరవించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యానాయుడు, పార్టీ స్థానిక నాయకులు లగిశెట్టి గణేష, మళ్ల గోపి, పప్పల మాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


నూకాంబిక సన్నిధిలో బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్

భానుడి భగభగలు


నిర్మానుష్యంగా ఉన్న కశింకోటలోని గవరపేట మధ్యవీధి ప్రాంతం

కశింకోట: స్థానిక వారపు సంత గురువారం సూర్య తాపానికి వెలవెలబోయింది. ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి క్రమేపీ జనం తగ్గారు. ఎండ వేడిమిని తట్టుకోలేక దుకాణాలు వదిలి చిరు వ్యాపారులు సమీపంలోని చిల్లర దుకాణాల వద్ద సేద తీరారు.


ఎండ తీవ్రతకు చిల్లర దుకాణాల నీడన సేదదీరుతున్న వీధి వ్యాపారులు, ప్రజలు

దీంతో కొనుగోలుదారులు, వ్యాపారులు లేక సంత బోసిపోయింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎండ తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టడంతో ప్రజలు వచ్చి తమకు కావలసిన కూరగాయలు, ఆకు కూరలు, మసాలా దినుసులు తదితర సామగ్రిని కొనుగోలు చేశారు. ఎండల తీవ్రతకు జన సంచారం లేక కశింకోటలోని వీధులు కూడా నిర్మానుష్యంగా మారాయి.

ముత్యాలమ్మా.. చల్లగ చూడమ్మా


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

- ఘనంగా మారువారం పండగ
- పోటెత్తిన భక్తులు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న అంతకాపల్లిలో కొలువైన ముత్యాలమ్మ మారువారం పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల దర్శనానికి అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పసుపు– కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


ఆకట్టుకున్న కోలాటం పోటీలు

చలివేంద్రం ప్రారంభం

అనకాపల్లి : వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పాస్టర్ పండ్రాన తిమోతి అన్నారు. స్థానిక వేల్పులవీధి పార్క్ సెంటర్ వద్ద గురువారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు వేసవి తాపంలో ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిమోతి

అవినీతి రహిత పాలనను ఆశీర్వదించండి


బూడి ముత్యాలనాయుడుకు, మలసాల భరత్‌కుమార్‌కు హారతి ఇస్తున్న మహిళ


ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కరపత్రం అందిస్తున్న బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్

- ఎన్నికల ప్రచారంలో బూడి ముత్యాల నాయుడు, మలసాల భరత్‌కుమార్
- అడుగడుగునా హారతులు పట్టిన ప్రజలు

అనకాపల్లి: పైసా అవినీతికి తావులేకుండా, తరతమ భేదాలు చూపకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఎంపీ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లు అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి విజయరామరాజుపేటలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం సమ స్థాయిలో అందించి, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి సీఎం జగనేనని కొనియాడారు. అవినీతి రహిత పాలనను అందించిన వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థించారు. తొలుత స్థానిక గణపతి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల సమయంలో కూడా రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా పేదలు ఇబ్బంది పడరాదని, ఎన్నికల మ్యానిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. కరోనా విపత్తులో దేశమంతటా ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారని, మన రాష్ట్రంలో మాత్రం ఆ ఇబ్బందులు కనీస స్థాయిలో మాత్రమే ఉండేవంటే దానికి కారణం సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. దేశమంతా జగన్ పాలనా విధానాలను ఆచరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 17 వైద్య కళాశాలలను స్థాపించడంతో ఆయా పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు.


గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్

ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్తుంటే ప్రతి ఒక్కరూ తమలో మనిషిగా అభిమానిస్తున్నారంటే దానికి సీఎం జగన్ పాలనే కారణమన్నారు. రానున్న కాలంలో నియోజకవర్గంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి తన శక్తి కొలది యువతకు మెరుగైన ఉపాధి కల్పిస్తానన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, జిల్లా యువజన విభాగ కార్యదర్శి జాజుల రమేష్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, ఏవీ రత్నకుమారి, మూలారి శ్రీను, పార్టీ నేతలు ఉగ్గిన శ్రీనివాసరావు, పలకా సత్యనారాయణ, ఆడారి శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో పార్టీనాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. ఉల్లిపాయ ధర కిలోకి రూ.5 తగ్గింది. ఉల్లి ధర రూ.20, టమాటా రూ.25 నుంచి రూ.30, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, కాకరకాయ రూ.60, చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి. అల్లం రూ.200కు విక్రయించారు.

మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: అక్రమంగా మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ హెచ్‌సీ రామకృష్ణ గురువారం తెలిపారు. వివరాలు. పట్టణంలో సత్తెమ్మతల్లి ఆర్చ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఎం.తులసీరామ్ 12 మద్యం సీసాలతో పట్టుబడ్డారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

8న నూకాంబిక అమ్మవారి పండగ

మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డులోని నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆమె గురువారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందన్నారు. 8వ తేదీన అమ్మవారి పండగ సందర్భంగా పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 9వ తేదీన కూడా ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.

ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్సకమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వైఎస్సార్‌సీపీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేడ సోమరాజు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.


నూకాంబిక అమ్మవారి పండగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యంపై పట్టణ పోలీస్‌లకు గురువారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ పీవీ రమణ తెలిపిన వివరాలు. ఈ నెల 2న తుమ్మపాల గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి, బయలుదేరింది. రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయినా జాడలేకపోవడంతో విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో బి సర్టిఫికెట్ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అభినందించారు. కళాశాల నుంచి తృతీయ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 29 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. వారంతా ఉత్తీర్ణులయ్యారు. ఈ సర్టిఫికెట్‌తో పాటు మిగిలిన శిక్షణ కూడా పూర్తి చేయాలని అభిలషించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మిగిలిన అధ్యాపకులతో కలిసి ఆమె అభినందించారు.